క్లుప్తంగా

ఆలస్యంగా చేరిన బ్యాలెట్ బాక్సులు

నవాబుపేట: మండలంలో పోలింగ్ ఆలస్యంగా పూర్తి కావటంతో శుక్రవారం తెల్లవారుజామువరకు బాక్సులు గమ్యస్థానం చేరుకున్నాయి. అసలే ఆలస్యంగా యన్మన్‌గండ్లలో 9 గంటల వరకు, లోకిరేవులో రాత్రి 11 గంటల వరకు సాగిన పోలింగ్ అనంతరం ఈవీఎం బాక్సుల తరలింపులో గందర గోళం చెలరేగింది. బస్సులు మొరాయించటంతో వేరే బస్సులో వాటిని తరలించేసరికి తెల్లారిందని సిబ్బంది వివరించారు.

ఫలితాలు వెల్లడించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూ పరిధిలోని పీజీ సెంటర్‌లలో ఫలితాలను వెల్లడించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు పట్టించుకోకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే వెల్లడించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు భరత్, నందు, అంజి, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో తగ్గిన పోలింగ్ శాతం

దేవరకద్ర: దేవరకద్ర నియోజకవర్గంలోని 8 మండలాల్లో మొత్తం లక్షా 94 వేల 543 ఓట్లు పోలయ్యాయి. పురుషులు 98,410, స్త్రీలు 96,133 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 2 లక్షల 35 వేల 154 ఓట్లు ఉండగా 82.73 శాతం ఓటింగ్ జరిగింది.

పెరిగిన ఓటింగ్...తగ్గిన ఓట్ల శాతం...

ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో ఓటు వేసిన వారి సంఖ్య పెరిగినా.. 2018 ఎన్నికలతో పోల్చుకుంటే ఓట్ల శాతం తగ్గింది. గత ఎన్నికల్లో మొత్తం 2,04, 930 ఓట్లు ఉండగా 1,74,426 ఓట్లు పోలయ్యాయి. అప్పుడు 85.11 శాతం పోలింగ్ జరిగింది. ఈసారి ఎన్నికల్లో ఓట్ల శాతం తగ్గి 82.73 శాతం పోలింగ్ జరిగినా 1,94,543 మంది ఓటు వేశారు. గత ఎన్నికలతో పోల్చితే 20,117 ఓట్లు పెరిగాయి. ఈసారి కొత్త ఓట్ల నమోదు తరువాత నియోజకవర్గంలో 30,213 కొత్త ఓట్లు పెరిగాయి దీని వల్ల పోలింగ్ పెరిగింది.

ముదిరెడ్డిపల్లిలో వందశాతం పోలింగ్

జడ్చర్ల: నియోజకవర్గంలోని రాజాపూర్ మండలం ముదిరెడ్డిపల్లిలోని పోలింగ్ స్టేషన్ 115లో వందశాతం పోలింగ్ నమోదయ్యింది. ఇక్కడ మొత్తం 672 మంది ఓటర్లు ఉండగా అందరూ తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా బాదేపల్లిలోని గాంధీ చౌక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన186 పోలింగ్ కేంద్రంలో అతి తక్కువగా పోలింగ్ నమోదైంది. ఇక్కడ మొత్తం 870 మంది ఓటర్లకు గానూ కేవలం 439 మంది మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో ఈ కేంద్రంలో అత్యల్పంగా 50.46 శాతం ఓటింగ్ నమోదైంది. మొత్తం 274 పోలింగ్ కేంద్రాల పోలింగ్ సరళిని పరిశీలిస్తే 21 కేంద్రాలలో 90 శాతం, 140 పోలింగ్ కేంద్రాలలో 80 శాతం, 17 కేంద్రాలలో 60 నుంచి 70 శాతం, 05 కేంద్రాలలో 50 నుంచి 60 శాతం నమోదైంది. కాగా జడ్చర్ల పట్టణంలోని దాదాపు 22 పోలింగ్‌కేంద్రాలలో తక్కువ పోలింగ్ శాతం నమోదు కావడం గమనార్హం.

అచ్చాయపల్లిలో 93.35 శాతం పోలింగ్

అడ్డాకుల: మూసాపేట మండలంలోని అచ్చాయపల్లి గ్రామంలో గురువారం జరిగిన ఎన్నికల్లో 93.45శాతం పోలింగ్ నమోదైంది. గ్రామంలో 376 మంది ఓటు హక్కును కలిగి ఉన్నారు. ఇందులో 351 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారిలో 174 పురుషులు, 177 మంది మహిళలు ఉన్నారు. ఈ లెక్కన ఓటరు జాబితాలో పేర్లున్న వారిలో కేవలం 25 మంది ఓటర్లు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకోలేదని తెలుస్తోంది. కాగా ఇందులో రెండు పేర్లు ఉన్న వారు, చనిపోయిన వారి పేర్లు కలిపి 13 ఉన్నట్లు తెలిసింది. వారి ఓట్లను తీసేస్తే 12 మంది మాత్రమే ఓటు వేయలేదని గ్రామస్తులు లెక్కలేస్తున్నారు.

తిమ్మాయిపల్లితండాలో 92.05శాతం పోలింగ్

అడ్డాకుల: మండలంలో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో మండల వ్యాప్తంగా తిమ్మాయిపల్లి తండాలోనే అత్యధిక పోలింగ్ నమోదైంది. తండాలో 1149 మంది ఓటర్లు ఉండగా ఇందులో 1063 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో 92.05శాతం పోలింగ్ నమోదైంది. ఇందులో 586 మంది పురుషులు, 477 మంది మహిళలు ఉన్నారు. తండాలో ఓట్లు వారిలో కేవలం 86 మంది ఓటర్లు మాత్రమే ఓటు హక్కును వినియోగించుకోలేదు. స్థానిక సంస్థల ఎన్నికలను తలపించేలా జరిగిన అసెంబ్లీ ఎన్నికల కోసం ముంబై, హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాల నుంచి గిరిజనులు తండాకు వచ్చి ఓటు వేశారు. కాగా పట్టణాల్లో ఓటు వేసేందుకు ఓటర్లు ఆసక్తి కనబర్చని నేపథ్యంలో గిరిజన తండాలో ఓటు చైతన్యం వెల్లివిరియడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.





గంగాపురంలో..



గండేడ్‌లో..



హన్వాడలో..

ఎయిడ్స్‌ను తరిమేయాలి



జిల్లా అధికారులకుజ్ఞాపికను అందజేస్తున్న పీయూ రిజిస్ట్రార్ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సమాజం నుంచి ఎయిడ్స్‌ను తరిమేయాల్సిన అవసరం ఉందని పీయూ రిజిస్ట్రార్ గిరిజ మంగతాయారు పేర్కొన్నారు. పీయూ ఆడిటోరియంలో ఎన్‌ఎస్‌ఎస్ సెల్, జిల్లా మెడికల్, హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అవగాహన ద్వారా మాత్రమే సమాజం నుండి ఎయిడ్స్‌ను తరిమి వేయగలమని, ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఎయిడ్స్ అనేది ఒక అంటురోగం కాదని, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు వైద్యుల సూచన మేరకు ఔషధాలు, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఎక్కువ రోజులు జీవించే అవకాశం ఉందన్నారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ కృష్ణ మాట్లాడుతూ జిల్లాలో నమోదైన కేసులలో అందరికి ప్రభుత్వం ఆసరా పింఛన్ ఇస్తుందని, దీని నిర్మూలనపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు తమ కార్యక్రమాల్లో భాగంగా ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమ అనంతరం వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన వారికి సర్టిఫికేట్లు ప్రదానం చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రవీణ్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ భాస్కర్‌నాయక్, సూపరిండెంట్ జీవన్,ఎయిడ్స్ నియంత్రణ అధికారిణి జరీనాబేగం, శంకర్, తరుపతిరావు, అర్జున్, గాలెన్న తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యార్థినులకు జంతుశాస్త్రం విభాగం, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో సంయుక్తంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ హాజరై ప్రసంగించారు. వైస్ ప్రిన్సిపాల్ గంగాధర్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు శ్రీవాణి, ఇమ్మాన్యుయేల్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన అవసరం అని, దాన్ని సమాజం నుంచి తరిమివేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎయిడ్స్ బాధితుల్లో ధైర్యం నింపాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ అధికారి రాఘవేందర్, బాలరాజు, వీణ, అధ్యాపకులు హరిప్రసాద్, ఉమాదేవి, ఆరీఫాజబీన్ తదితరులు పాల్గొన్నారు.

గండేడ్‌లో ర్యాలీ..

గండేడ్: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శుక్రవారం ఎయిడ్స్ ర్యాలీ నిర్వహించారు.



ఎన్టీఆర్ కళాశాలలో..

స్థానిక వైద్యాధికారి చంద్రశేఖర్ ప్రారంభించారు. ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హన్వాడ: మండలకేంద్రంలో ఆపరేషన్ మెర్సీ ఇండియా ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని స్థానిక మండల వైద్యాధికారిని ప్రీతి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో ఓఎమ్‌ఐఎఫ్ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్ శాంసన్, మండల కోఆర్డినేటర్ రాములు, సంస్థ ఆరోగ్య కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్:

అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని గంగాపురం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం పరిధిలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. గంగాపురం కేంద్రంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించి ఎయిడ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. ఎల్‌హెచ్‌పీఎస్ డాక్టర్లు, సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా మండలంలోని ఆరోగ్య ఉప కేంద్రాల్లోనూ ర్యాలీలు నిర్వహించారు.

సంతలో 'చోరీ'ల చింత

- ప్రతి శుక్రవారం దొంగతనానికి గురవుతున్న మొబైల్ ఫోన్లు

బాలానగర్: మండల కేంద్రంలో జరిగే వారాంతపు సంతలో ప్రజలకు చింత తప్పడం లేదు. ప్రతి శుక్రవారం జరిగే వారాంతపు సంతకు చిరువ్యాపారులు, కొనుగోలు దారులు. మండల ప్రజలు వేల సంఖ్యలో వస్తూ పోతూ ఉంటారు. అయితే కొనుగోలుదారుల నుంచి ప్రతి శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులో మొబైల్ ఫోన్లను దొంగిలిస్తున్నారు. దీంతో సంతకు వచ్చే వారు ఎప్పుడు మొబైల్ ఫోన్లను పోగొట్టుకోవాల్సి వస్తుందో తెలియని పరిస్థితి. ఈ వ్యవహారంలో 13 నుంచి 18 సంవత్సరాల లోపు ఉన్న బాలురు దొంగతనానికి పాల్పడుతున్నట్లు పలువురు బాధితులు పేర్కొన్నారు. గతంలో 15 సంవత్సరాల బాలుడు ఓ వ్యక్తి వద్ద నుంచి మొబైల్ ఫోన్ దొంగిలించి పారిపోతుండగా పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు సైతం అప్పగించారు. అయినా సంత బజారులో జరిగే దొంగతనాలు మాత్రం తగ్గలేదు. పట్టుబడిన వ్యక్తి మైనర్ కావడంతో పోలీసులు సైతం మొక్కుబడిగానే వ్యవహరించారని మండల ప్రజలు చర్చించుకున్నారు. ఇప్పటికై నావారాంతపు సంతలో మొబైల్ ఫోన్ల దొంగలను పట్టుకుని కఠినంగా శిక్షించాలని, దొంగిలించబడిన ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆర్థిక సాయం

అడ్డాకుల: మండలంలోని కందూర్‌కి చెందిన ఇద్దరికి అదే గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మున్నూర్ రమేష్ శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన రాములు, నవీన్ ఇళ్ల వద్దకు వెళ్లి వారిని పరామర్శించారు. ఇద్దరికీ చెరో రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం చేసి అండగా ఉంటానని తెలిపారు. ఉప సర్పంచ్ శంకర్, ఆర్టీసీ రాములు, దాసు, బాలకృష్ణ ఉన్నారు.



నవాబుపేట మండల కేంద్రంలో మంచు మబ్బులు



నవాబుపేట మరికల్‌లో..

ఇంకా తెలవారదేమీ!

నవాబుపేట: 'ఇంకా తెలవారదేమీ...ఈ చీకటి విడిపోదేమీ' అని అన్నట్లుగా పొగమంచు మండలంలోని గ్రామాలను కమ్మేస్తోంది. శుక్రవారం ఉదయం 8 గంటలు దాటినా గ్రామాలు మంచు దుప్పటిలో ముసుగు వేసి ఉన్నాయి. దారులను మంచు కప్పి వేయటంతో పగలు సైతం వీధిదీపాలు వెలిగించి వాహనాలు సైతం లైట్ల వెలుతురులో ప్రయాణం చేయటం విశేషం.

మరమ్మతు లేనట్లేనా?

- దెబ్బతిన్న గ్రామీణ ప్రాంతాలరోడ్లు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



గుంతలమయంగా రాయపల్లి రోడ్డు

రాజాపూర్: గ్రామీణ ప్రాంతాల కోసం రూ.కోట్లు ఖర్చు చేసి వేసి బీటీ రోడ్లు కొన్ని సంవత్సరాలుగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. పూర్తిగా దెబ్బతినడం అట్టిరోడ్లపై ప్రయాణమంటేనే వాహనదారులు, ప్రజలు జంకుతున్నారు. మండలంలోని రాయపల్లి, మల్లేపల్లి, నందిగామ తదితర గ్రామాలకు వేసిన రోడ్లు దెబ్బతిని గుంతలమయంగా మారాయని చెబుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మారుతున్నారు కానీ దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతు చేయించడం లేదని పేర్కొంటున్నారు. వాటిని బాగుచేయించాలనే ఆలోచన అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎందుకు రావడం లేదని గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆయా గ్రామాల నుంచి ప్రతి రోజు వందల సంఖ్యలో పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, గ్రామాల ప్రజలు ప్రయాణిస్తున్నారు. దెబ్బతిన్న రోడ్లపై పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. నిధులు మంజూరు అయ్యాయని చెబుతున్నారు.. కానీ పనులు ఎందుకు చేయడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

ఇబ్బందులు తప్పడంలేదు



ప్రతిరోజు చదువుకునేందుకు కాలేజీకి వెళ్లాలంటే ఈదెబ్బతిన్న తిన్నరోడ్డు మీద ప్రయాణించక తప్పడంలేదు. వర్షకాలంలో అయితే గుంతల్లో నీళ్లు చేరి మరిన్ని అవస్థలు పడాల్సి వస్తోంది. పలువురు ప్రమాదాలకు గురై గాయపడిన ఘటనలు కూడా ఉన్నాయి. మా గ్రామానికి ఉన్నరోడ్డుకు కనీసం మొరం పోసైనా ఇబ్బందులు తొలగించాలి.

– మణిశంకర్‌గౌడ్, రాయపల్లి

అభివృద్ధి పథంలో కోడ్గల్

- గ్రామం అంతా అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటు
- పార్కింగ్‌టైల్స్, సెంట్రల్‌లైటింగ్‌తో ఆకట్టుకునే రోడ్డు
- 40 డబుల్‌బెడ్‌రూంల పంపిణీ

గ్రామపంచాయతీ వివరాలు

జనాభా	: 2340
ఓటర్లు	: 1430
పురుషులు	: 1139
స్త్రీలు	: 1202
అనుబంధ గ్రామం	: మక్తపల్లి
ఆసరా పింఛన్లు	: 370
దివ్యాంగులు	: 48
ఇళ్లు	: 535
రైతుబంధు లబ్ధిదారులు	: 700



సెంట్రల్‌లైటింగ్ రోడ్డు



కోడ్గల్ వ్యూ



డబుల్‌బెడ్‌రూంలు

జడ్చర్ల టౌన్: మండలంలోని కోడ్గల్ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోంది. గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం, కొంత ప్రాంతం సెంట్రల్‌లైటింగ్, పార్కింగ్‌టైల్స్‌తో రోడ్డు, రైతువేదిక తదితర అనేక సౌకర్యాలు కల్పించారు. అదే విధంగా 40 డబుల్‌బెడ్‌రూంల నిర్మాణం చేసి లబ్ధిదారులకు అందజేశారు. గ్రామపంచాయతీ కార్యాలయానికి నూతన భవన నిర్మాణం ఒక్కటే పెండింగ్‌లో ఉండగా మండల కేంద్రం కావాలంటున్న గ్రామాల ప్రజల ఆకాంక్ష నెరవేరుతుందా వేచి చూడాల్సిందే.

కోడి, కల్లుకు ప్రసిద్ధి

నిజాం నవాబుల పాలనలో గ్రామంలో తహశీల్ కచ్చేర్ (జైలు) ఉండేది. జైలులో ఉన్న వారిని చూడటానికి వచ్చే వారికి, నిజాం నవాబుల సైనికాధీశులు, సైన్యం, ఇతర అధికారులకు స్థానికంగా నాణ్యమైన కల్లు లభించేది. కల్లుతో పాటు కోళ్లు విరివిగా దొరికేవి, దీంతో కొందరు కోడిని తీసుకుని కల్లుతాగేందుకు ఎక్కువగా వచ్చే వారు కావటంతో కోడికల్లుగా ఈ గ్రామం ప్రసిద్ధిగాంచింది. కోడికల్లు కాస్త కాలక్రమేణా కోడ్గల్‌గా మారింది.

ఇవి అభివృద్ధి పనులు

- రూ.56లక్షలతో అండర్‌డ్రెయినేజీ
- రూ.41లక్షలతో సీసీరోడ్లు
- మన ఊరు మన బడి నిధులు రూ.35లక్షలతో డైనింగ్‌హాల్
- రూ.22లక్షలతో రైతువేదిక
- రూ.2కోట్ల60వేలతో 40 డబుల్‌బెడ్‌రూంల నిర్మాణం లబ్ధిదారులకు అందజేత
- రూ.4కోట్ల20లక్షలతో గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల పూర్తి
- రూ.10లక్షలతో సెంట్రల్ లైటింగ్, పవర్‌బ్లాక్‌టైల్స్
- రూ.12లక్షలతో వైకుంఠదామం
- రూ.5లక్షలతో ఎస్సీ కమ్యూనిటీహాల్
- రూ.6లక్షలతో ఎల్‌ఈడీ బల్బులు
- రూ.5లక్షలతో శానిటేషన్
- 78 పాత ఇళ్ల కూల్చివేతతోపాటు మరో రూ. 40లక్షలతో వివిధరకాల పనులు

పంచాయతి భవనానికి రూ.22లక్షలు

కోడ్గల్‌లో గ్రామపంచాయతీ కార్యాలయానికి నూతన భవన నిర్మాణం కోసం రూ.22లక్షలు మంజూరయ్యాయి. ప్రస్తుత పంచాయతీ పాలకవర్గం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసే పనిలో ఉంది.

గణనీయమైన అభివృద్ధి



గ్రామంలో అండర్ డ్రెయినేజీ, సీసీరోడ్లు, 40 డబుల్ బెడ్‌రూం తదితరాలతో పాటు ఎన్నో పనులు చేయించాం. పంచాయతీ భవనం నిర్మాణం చేయాల్సి ఉంది. మరికొన్ని అభివృద్ధి పనులు చేపట్టేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఎమ్మెల్యే డా.లక్ష్మారెడ్డి, జెడ్పీవైస్‌చైర్మన్ యాదయ్య ఎంతో సహకారం అందిస్తున్నారు. –మమత, సర్పంచ్, కోడ్గల్

కంకరవేసి బీటీ వదిలేశారు

- చెరువుకు కంచె లేక రోడ్డుపై నుంచి జారిపడుతున్న ప్రజలు
- వాహనాల పార్కింగ్ లేక ప్రయాణికుల పాట్లు
- బాలానగర్ రైల్వేస్టేషన్ వద్ద పరిస్థితిపై అసహనం



స్టేషన్ వద్ద ఇష్టానుసారంపార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలు

బాలానగర్: మండలకేంద్రంలోని రైల్వేస్టేషన్ వద్ద సౌకర్యాల పరిస్థితిపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏడాదిన్నర క్రితం స్టేషన్‌కు మట్టి రోడ్డును ఏర్పాటు చేసి వదిలేసిన అధికారులు తదనంతరం బీటీకోసం కంకర వేసి వదిలేశారు. అయితే ఎలాంటి రోడ్డు నిర్మించకపోగా.. గూడ్స్ వాహనాల కోసం మాత్రం ఆరునెలల క్రితం బీటీరోడ్డు ఏర్పాటు చేశారని.. ప్రజల అవసరాలు, సమస్యల కంటే సంబంధిత శాఖకు ఆదాయం వచ్చే వాటిపైనే దృష్టి ఉందని పలువురు వాపోతున్నారు. ప్రయాణికుల అవసరాలను గాలికి వదిలేస్తున్నారని నిత్యం రైల్వే స్టేషన్‌కు వచ్చిపోయే వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా రైల్వేస్టేషన్ వద్ద ఎలాంటి వాహన పార్కింగ్ సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్కింగ్ లేకపోవడంతో కిలోమీటర్ల మేర నడక ద్వారానే ప్రయాణికులు స్టేషన్‌కు రాకపోకలు సాగిస్తూ అవస్థలు పడుతున్నామని చెబుతున్నారు. స్టేషన్‌కు వచ్చే కంకర దారికి ఆనుకుని సుమారు వందల మీటర్ల మేర చెరువు నిండు కుండలా ఉందని... చెరువు రోడ్డుకు ఎలాంటి కంచె లేకపోవడంతో గతంలో ఓ ప్రయాణికుడు అందులో పడ్డాడని అంటున్నారు. ఇలాంటి ఘటనలు జరుగుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. పత్రికల్లో ప్రచురితం అయినా సదరు శాఖ నేటికి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కంకర రోడ్డును బీటీగా మార్చడంతోపాటు, చెరువుకు కంచె ఏర్పాటు చేయడం, ప్రయాణికులకు అవసరమైన పార్కింగ్ సదుపాయం.. ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.



కంకరవేసి వదిలేసిన రైల్వే స్టేషన్ ప్రధాన రోడ్డు

రెవెన్యూ గ్రామంగా మారేదెన్నడో?

మరికల్: మండలంలోని అప్పంపల్లిని రెవెన్యూ గ్రామంగా మారడం లేదు. ఇంకేనాళ్లు నిరీక్షణ చేయాలని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ దాదాపు 3వేలకు పైగా జనాభా ఉన్నారు. కాని అప్పంపల్లి శివారు మాత్రం కిష్టాపూర్, మాధ్వార్, మరికల్, మందిపల్లి సరిహద్దులో ఉండటం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. భూములకు సంబందించిన వివరాలు, బ్యాంకు రుణాల విషయంలో ఆయా గ్రామాల అధికారులను సంప్రదించాల్సి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 500 జనాభా ఉన్న గ్రామాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసిన తర్వాత రెవెన్యూ గ్రామాల ప్రస్తావన తెర మీదకు తీసుకురాకపోవడంతో మాలాంటి గ్రామాలకు తీరని అన్యాయం జరుగుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. వచ్చే ప్రభుత్వమైనా అప్పంపల్లిని రెవెన్యూ గ్రామంగా మార్చాలని కోరుతున్నారు.



అప్పంపల్లి గ్రామం

దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: తనపై దాడి చేసిన వ్యక్తితోపాటు దాడికి కారకులు అయిన వారిపై కేసు నమోదు చేయాలని కోరుతూ మాజీ టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి శుక్రవారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌కు ఫిర్యాదు చేశారు. ఈనెల 30 పోలింగ్ రోజున మహబూబ్‌నగర్ పట్టణంలోని శ్రీనివాసకాలనీలోగల 100, 101 పోలింగ్ బూత్ నుంచి బయటకు వచ్చి నిలబడగా ఓ పార్టీకి చెందిన వ్యక్తి తనపై దాడి చేసి తలపై తీవ్రంగా కొట్టాడని అన్నారు. కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్పీకి వినతిపత్రం అందజేసిన వారిలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వినోద్‌కుమార్, సీపీఎం, సీపీఐ, వైఎస్సార్‌టీపీ, ప్రజా సంఘాల నాయకులు తదితరులు ఉన్నారు.